

విజేతలకు ట్రోఫీని బహుకరిస్తున్న హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్, రాచకొండ సీపీ సుధీర్‌బాబు

క్రీడల ద్వారా పోలీసులలో సమష్టితత్వం పెరుగుతుంది

● హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా పోలీసులలో సమష్టి తత్వం పెరుగుతుందని హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్ అన్నారు. రాచకొండ కమిషనరేట్ ఐదవ వార్షిక స్పోర్ట్స్ మీట్-2024 పోటీలు శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు వ్యక్తుల మానసిక, శారీరక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని కర్తవ్య నిర్వాహణలో భాగంగా రేయింబవళ్లు పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఈ క్రీడా పోటీల నిర్వాహణ ద్వారా పోలీసులు రెట్టించిన ఉత్సాహంతో పనిచేసే అవకాశం ఉందన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ శాంతిభద్రతల నిర్వాహణలో, నేర నియంత్రణలో జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో ఉందని, మరింత అంకితభావంతో పనిచేసి ఆ మంచిపేరును కొనసాగించుకోవాలని ఆయన సూచించారు. రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న విధంగానే పోలీసు సిబ్బంది రెట్టించిన ఉత్సాహంతో సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి డీసీపీ రాజేష్‌చంద్ర, మల్కాజిగిరి డీసీపీ పద్మజ, ఎస్ఓటీ డీసీపీ గిరిధర్, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, మహేశ్వం డీసీపీ సునితారెడ్డి, ఎస్ఓటీ మురళీధర్, డీసీపీ (అడ్మిన్) ఇందిర, అదనపు డీసీపీలు, ఏసీపీలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

చంపాపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్‌లోని కుమ్మరి బస్తీలో శనివారం జీహెచ్‌ఎంసీ నిధులు రూ.53లక్షలతో చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని కాలనీలు, బస్తీలలో మౌలికవసతుల కల్పనల కోసం కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. సీసీ రహదారులు, కమ్యూనిటీహాల్స్ నిర్మాణాల కోసం చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. సుల్తాన్‌వాల్యా బస్తీలో కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు పూర్తి కావచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు రాజయ్య, నర్సింగ్‌రావు, సుదర్శన్‌గౌడ్, లక్ష్మమ్మ, అనిత, సువర్ణ, కవిత, యాదమ్మ, సరిత, మాదవి, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు గూడూరు అవినాష్‌రెడ్డి, దశరథ్‌గౌడ్, సిల్వేరు అనిల్‌కుమార్, యోగిరాజ్, పాశం శ్రీశైలం, టింగ్లీకర్ రాజేష్, బానుక రమేష్ పాల్గొన్నారు.

ఉద్యానవనాల అభివృద్ధికి కృషి : కార్పొరేటర్

చంపాపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవనాల అభివృద్ధి కోసం కృషి చేయనున్నట్లు కార్పొరేటర్ సుజాతనాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ లోని బీమానగర్‌కాలనీలో పార్కులో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.13లక్షలతో చేపట్టనున్న ప్రహరీగోడ నిర్మాణ పనులకు శనివారం కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని ఆయా కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. పార్కులను సుందరీకరణ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శ్రీనివాసగుప్తా, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రాంచంద్రనాయక్, మమత మల్లేష్‌గౌడ్, కాలనీ ప్రతినిధులు నర్సింహారెడ్డి, నరేష్, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లెలగూడలో యూజీడీ పనులు ప్రారంభం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడ 16వ డివిజన్‌లోని ఓల్డ్ పాష్‌కాలనీలో రూ.5లక్షలతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణం పనులను కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌కుమార్‌యాదవ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి సబితారెడ్డి సహకారంతో ఈ నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించినట్లు చెప్పారు. స్థానిక నాయకులు మేకల యాదగిరి, మహ్మద్‌అలీ, నర్సింహ, శ్రీకాంత్ సాగర్, మురళీముదిరాజ్, బషీరాబీ, ఫర్హానా తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల ఎంపీ టికెట్ ఇవ్వండి

గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేసిన మేయర్ కుమారుడు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రానున్న పార్లమెంటు ఎన్నికల్లో తనకు చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాతా నర్సింహారెడ్డి కోరారు. ఈమేరకు శనివారం ఆమె తరఫున కుమారుడు దయారెడ్డి, రాము గాంధీభవన్‌లో పార్టీ పెద్దలను కలిసి దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా పారిజాతారెడ్డి బడంగ్‌పేట్‌లో విలేకరులతో మాట్లాడుతూ తనకు గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా టికెట్ కేటాయింపులో అన్యాయం జరిగినందున వచ్చే ఎన్నికల్లో చేవెళ్ల నుంచి ఎంపీ అభ్యర్థిగా తన పేరును పరిశీలించాలని అధిష్ఠానం పెద్దలను కోరారు. పోటీ చేసే అవకాశం కల్పిస్తే మంచి మెజారిటీతో గెలిచి చేవెళ్ల స్థానాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి కానుకగా ఇస్తానని పారిజాతారెడ్డి చెప్పారు.

పాత కక్షలతో వ్యక్తిపై కర్రలతో దాడి..



దాడిలో గాయపడిన గుండా రాజు

వనస్థలిపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్ర జ్యోతి): పాత కక్షలతో వ్యక్తిపై దాడి చేసి చితకబాదిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కమ్మగూడలోని శాంతినగర్‌లో నివాసముంటున్న గుండా రాజు(33) భార్య మౌనిక, ఇద్దరు పిల్లలతో కలిసి వ్యవసాయ పనులు, పాల వ్యాపారం చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. రాజు సమీప బంధువైన గుండా వెంకటేష్(45)తో గత నాలుగు సంవత్సరాలుగా భూతగాదాలు ఉండడంతో గ్రామపెద్దల సమక్షంలో సమస్యను పరిష్కరించుకున్నారు. అంతా సద్దుమణిగిందని అనుకుంటున్న సమయంలో ఈనెల 1న ఉదయం 8గంటలకు రాజు తన వ్యవసాయ భూమి వద్ద ఉన్న గేదెల వద్ద పాలు పిండుకుని వస్తున్న సమయంలో గుండా వెంకటేష్ బావి వద్ద ఉన్న కుక్క రాజును చూసి అరవడంతో రాజు ఆ కుక్కను కొట్టాడు. ఇది గమనించిన గుండా వెంకటేష్, అతని కొడుకు గుండా నవీన్(20)లు కోపంతో మా కుక్కనే కొడుతావా అని ఆగ్రహం వ్యక్తం చేసి రాజుపై కర్రలతో దాడికి దిగి చితకబాదారు. దీంతో రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. ఇదంతా అక్కడే ఉన్న మరో వ్యక్తి దాడిని అడ్డుకోకుండా వీడియో తీసి సోషల్ మీడియోలో వైరల్ చేశాడు. సమాచారం అందుకున్న రాజు కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్ర గాయలై ఒళ్లంతా రక్తపు మరకలతో ఉన్న రాజును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుని భార్య మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన గుండా వెంకటేష్, గుండా నవీన్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేత



కమిషనర్ రవీందర్‌రెడ్డికి సమ్మె నోటీసును అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మె నోటీసును సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు శనివారం కమిషనర్ రవీందర్‌రెడ్డికి అందజేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు ఏర్పుల నర్సింహ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జైంట్ ప్లాట్ ఫామ్ ట్రేడ్ యూనియన్స్, కార్మిక, ఉద్యోగ సంఘాలు, అఖిలభారత ఫెడరేషన్ల ఆధ్వర్యంలో గ్రామీణ భారత్ బంద్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. 16న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్మికులు మైసయ్య, జంగయ్య, నరసింహ పాల్గొన్నారు.

ఎర్రగుంట చెరువు.. వ్యర్థాలకు నెలవు



కుచించుకుపోయిన ఎర్రగుంట చెరువు

దుర్వాసనతో సమీప ప్రజల అవస్థలు ● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

చెరువులను పరిరక్షిస్తాం, కట్టలపై వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేసి సుందరీకరిస్తాం.. అంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు చేసిన ప్రకటనలకు, చేతలకు పొంతన ఉండటం లేదని చెప్పాలి. సుందరీకరణ, ఇతర హంగుల మాటెలా ఉన్నా... నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా నీటితో కళకళలాడాల్సిన సైదాబాద్ దోబీఘాట్ ఎర్రగుంట చెరువు మట్టికుప్పలతో పూడుకుపోతున్నది. ఎర్రగుంట చెరువు మురికికూపంగా మారింది. అక్కడ చెత్తచెదారం, వ్యర్థాలు వేయడంతో అపరిశుభ్రంగా మారింది. ఆహ్లాదం పంచాల్సిన కాసారం దుర్వాసన వెదజల్లుతోంది.



గేటుకు అడ్డంగా మట్టికుప్పలు

సైదాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): 2016లో సైదాబాద్ సమావేశంలో నాటి సీఎం కేసీఆర్ ఎర్రగుంట చెరువు అభివృద్ధికి మిషన్ కాకతీయలో రూ.2కోట్లు నిధులు మంజూరు చేస్తున్నట్లు బహిరంగంగా ప్రకటించారు. కానీ కోర్టు వివాదాల కారణంగా నిధులు మంజూరు కాలేదు. చెరువు అభివృద్ధి మాటెలా ఉన్నా ఆక్రమణలపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రేక్షకపాత్ర వహించడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హవ్వ... ఇవేం పనులు!



పట్టణ ప్రగతిలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది నిర్వాకం (ఫైల్)

చెరువుపై పర్యవేక్షణ లేకపోవడంతో సమీప ప్రాంతాల నుంచి ఇళ్ల వ్యర్థాలు, మాంస వ్యర్థాలు వేస్తున్నారు. అంతేగాకుండా పట్టణ ప్రగతి కార్యక్రమంలో సైతం మట్టికుప్పలు, వ్యర్థాలను స్వయంగా జీహెచ్ఎంసీ సిబ్బంది లారీలలో తీసుకువచ్చి పడవేశారు. ఈ విషయంపై అప్పటి జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సర్కిల్-7 మంగతాయారును ఆంధ్రజ్యోతి ప్రశ్నించగా తాత్కాలికంగా మట్టికుప్పలు నిల్వ చేస్తున్నామని, కొద్ది రోజుల తర్వాత బయట ప్రాంతాలకు తరలిస్తామని చెప్పారు. కానీ నెలలు గడుస్తున్నా మట్టికుప్పలు తొలగించిన పాపానపోలేదు. ఈవిధంగా అధికారులే చెరువు పూడ్చివేతకు పరోక్షంగా పాలుపంచుకోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మట్టికుప్పలు, వ్యర్థాలు తొలగించి చెరువును ఆహ్లాదభరితంగా చేయాలని కోరుతున్నారు.

ఎన్నాళ్లని ముక్కు మూసుకునేది?

జనవాసాల మధ్య ఆహ్లాదంగా ఉండాల్సిన చెరువు దుర్గంధంగా మారింది. చెరువులో కలుషిత, మురుగునీరు చేరుతుండటంతో పరిసరాలు దుర్గంధంగా మారుతున్నాయి. రోగాల బారిన పడుతున్నామని సమీప వాణినగర్, పూర్ణోదయ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీవాసులు అంటున్నారు. అడ్డంగా వేసిన మట్టికుప్పలతో చెరువు వద్దకు వెళ్లలేని పరిస్థితి, ముఖ్యంగా రాత్రివేళలలో చెరువు నుంచి దుర్వాసనతో ఇళ్ల కిటికీలు తెరిచి ఉండలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి నంబర్లను రద్దు చేయాలి

● పాత ఎస్సీ కాలనీవాసులు



మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న పాత ఎస్సీ కాలనీవాసులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ పాత ఎస్సీ కాలనీ గ్రామకంఠం స్థలంలో కేటాయించిన ఇంటి నంబర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసులు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. పాత ఎస్సీ కాలనీవాసులు పెద్ద ఎత్తున మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని ఇంటి నంబర్లను రద్దు చేయడంతో పాటు నిర్మాణాలను వెంటనే తొలగించాలని అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. 6వ వార్డు పరిధిలోని పాత ఎస్సీ కాలనీ గ్రామకంఠం స్థలంలో కొంతమంది అక్రమంగా కబ్జా చేస్తూ ప్రహరీ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. నకిలీ అనుమతులు, ప్రొసీడింగ్‌లను సృష్టించి మున్సిపాలిటీలో ఇంటి నంబర్లకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దీంతో 4 ఇళ్లకు మున్సిపల్ అధికారులు ఇంటి నంబర్లను కేటాయించారని చెప్పారు. అడ్డదారిలో పొందిన ఇంటి నంబర్లను వెంటనే రద్దుచేసి ఆ స్థలాల్లో వెలసిన నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు.

నంబర్లను రద్దు చేసే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ హెచ్చరించారు. దీంతో కమిషనర్ ఇంటి నంబర్లను రద్దు చేస్తున్నట్లు వారికి తెలిపారు. అనంతరం కాలనీవాసులు సబ్‌రిజిస్ట్రార్‌ను కలిసి ఆ ప్లాటకు రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి జగన్, యంజాల్ ప్రహ్లాద్, సంజీవ, రాంబాబు, అచ్యుత్, రాములు, మల్లేష్, నర్సింహ, పెద్ద నర్సింహ, యాదగిరితో పాటు పాత ఎస్సీ కాలనీవాసులు పాల్గొన్నారు.

సెవన్ సీటర్ ఆటోలను సంతోష్‌నగర్ వరకు అనుమతించాలి

● ఎమ్మెల్యేకు ఆటో డ్రైవర్ల వినతి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసిన సెవన్ సీటర్ ఆటోల డ్రైవర్లు

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సెవన్ సీటర్ ఆటోలను సంతోష్‌నగర్ వరకు అనుమతించేలా చర్యలు తీసుకోవాలని సెవన్ సీటర్ ఆటో డ్రైవర్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కోరారు. శనివారం ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసిన ఆటో డ్రైవర్లు తమ సమస్యలను వివరించారు. గతంలో ఎల్‌బీనగర్ నుంచి సంతోష్‌నగర్, బీఎన్‌రెడ్డి నగర్ నుంచి సంతోష్‌నగర్ వరకు సెవన్ సీటర్ ఆటోలను నడిపేవారమని, కానీ ప్రస్తుతం ట్రాఫిక్ పోలీసులు సంతోష్‌నగర్ వరకు రాకుండా కేవలం ఆర్‌టీసీ కాలనీ వరకు మాత్రమే అనుమతిస్తున్నారని వారు వాపోయారు. దీంతో ప్రయాణికులు సెవన్ సీటర్ ఆటోలను ఎక్కడంలేదన్నారు. సంతోష్‌నగర్ వరకు వెళితే చలాన్లు రాస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి మాకు న్యాయం చేయాలని వారు సుధీర్‌రెడ్డిని కోరారు. దీంతో ఆయన వెంటనే పోలీసు ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి సెవన్ సీటర్ ఆటో డ్రైవర్ల సమస్యలను వారికి వివరించారు. రెండు రోజుల్లో అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి తగు న్యాయం చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెవన్ సీటర్ ఆటో డ్రైవర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సంతుయాదవ్, ఉపాధ్యక్షులు చాంద్‌పాషా, అజీమ్, ప్రధాన కార్యదర్శి మహేందర్, సంయుక్త కార్యదర్శి నర్సింహ, కోశాధికారి లింగం, సభ్యులు లింగమయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.50లక్షల నకిలీ మద్యం ధ్వంసం

● మూసీలో పారబోత 1050 కిలోల నల్లబెల్లం
● సరూర్‌నగర్ సూపరింటెండెంట్ రవీందర్‌రావు



నకిలీ మద్యం బాటిళ్లను ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేయిస్తున్న ఎక్సైజ్ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రూ.50లక్షల విలువైన నకిలీ మద్యం బాటిల్స్‌ను హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు శనివారం ధ్వంసం చేశారు. దాంతోపాటు పట్టుబడిన 35 బస్తాల నల్లబెల్లంను మూసీ నదిలో పారబోశారు. సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రావు, హయత్‌నగర్ ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్‌గౌడ్, ఇబ్రహీంపట్నం సీఐ శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో పెద్దఅంబర్‌పేట్‌లో నకిలీ మద్యం బాటిల్స్‌ను ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేశారు. గత ఏడాది ఒడిశా రాష్ట్రంలోని కటక్ ప్రాంతంలో ఎక్సైజ్ పోలీసులు చేసిన దాడిలో 338 కేసుల నకిలీ మద్యంతో పాటు 1050 కిల్లో నల్లబెల్లంను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ కేసు విచారణ పూర్తికావడంతో ఎక్సైజ్ ఉన్నత అధికారుల ఆదేశాలతో అక్కడ స్వాధీనం చేసుకున్న 338 కేసుల మద్యం (3వేల లీటర్లు)ను పెద్దఅంబర్‌పేట్‌లోని ఓసీసాల కంపెనీలో ఎక్స్‌కవేటర్‌తో పూర్తిగా ధ్వంసం చేశారు. అదేవిధంగా 35బస్తాలలోని 1050కిలోల నల్లబెల్లంను గౌరెల్లి వద్ద మూసీ నదిలో పారబోశారు. ఈ సందర్భంగా సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రావు మాట్లాడుతూ బెల్టు షాపులో దొరికిన ఆధారంతో ఒడిశాలోని కటక్‌లో పెద్ద ఎత్తున నకిలీ మద్యంను పట్టుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యంను పరీక్షల అనంతరం హానికరమైనదిగా గుర్తించి ధ్వంసం చేయాలని ఉన్నత అధికారులు ఆదేశాలు జారీచేశారని తెలిపారు. గంజాయి, డ్రగ్స్‌పై స్పెషల్ డ్రైవ్ కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా యువత గంజాయికి దూరంగా ఉండాలని చెప్పారు. ప్రజల ఆరోగ్యానికి హానికలిగించే పదార్థాలపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు వెంకన్న, యాదయ్య హనుమంతు, సరళ, సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ పాలనలో కార్పొరేట్ల ఆదాయమే పెరిగింది: సీఐటీయూ



కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి తదితరులు

మన్సూరాబాద్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మోదీ కార్పొరేట్ల అనుకూల విధానం వల్ల వారి ఆదాయం భారీగా పెరగగా.. పేదల ఆదాయం మాత్రం పడిపోయిందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 16న దేశవ్యాప్తంగా చేపడుతున్న కార్మికుల సమ్మెకు సంబంధించిన కరపత్రాలను శనివారం ఆటోనగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. మోదీ పాలనలో నిరుద్యోగం భారీగా పెరిగిందని, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడమే ధ్యేయంగా పని చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లోని ఖాళీలను భర్తీ చేయటంలేదన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. జీహెచ్‌ఎంసీ అంగన్వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు ఆలేటి ఎల్లయ్య, వెంకటమ్మ, శ్రీదేవి, లక్ష్మమ్మ, విజయలక్ష్మి, దనమ్మ పాల్గొన్నారు.



కరాటే చాంపియన్‌షిప్‌లో గోల్డ్ మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్ సాధించిన విద్యార్థులతో శిక్షకులు, ఉపాధ్యాయులు

కరాటే చాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ కరాటే చాంపియన్‌షిప్‌లో సరూర్‌నగర్ జడ్‌పీహెచ్‌ఎస్ ఉర్దూ మీడియం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇటీవల సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సెకెండ్ ఇంటర్నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ కరాటే చాంపియన్‌షిప్-2024 నిర్వహించారు. ఈ చాంపియన్‌షిప్‌లో సరూర్‌నగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియం విద్యార్థులు గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ సాధించారు. విద్యార్థినులు సాజియా ఎలిమి, యాస్మిన్ కార్తున్, సాఫియా సుల్తాన, సబా తబస్సుం, తన్వీర్ ఫాతిమాలు ఈ చాంపియన్‌షిప్‌లో పాల్గొని మెడల్స్ సాధించారు. వారిని ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రామావత్ తావురియా నాయక్ అందించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ మహమ్మద్ ఇసాం, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు జమీల్ పర్వేజ్, నైముద్దీన్, రహీం, నజ్మా జహీరా, తస్లీమ్ బేగం, యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టండి

● బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

వనస్థలిపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేవిధంగా నాసిరకంతో కాకుండా నాణ్యతతో చేపట్టాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని హరిహరపురం కాలనీ త్రిశక్తి దేవాలయం ముందు జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ లచ్చిరెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతలోపాలు లేకుండా చేపట్టాలన్నారు. నాసిరకం పనులు చేపడితే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ నరేంద్ర తేజ, కాలనీ గౌరవ అధ్యక్షులు శంకరయ్యగౌడ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

2 కిలోల గంజాయి పట్టివేత

● పట్టుబడిన వారిలో ముగ్గురు విద్యార్థులు

చంపాపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్ పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీలో 2కిలోల గంజాయిని పట్టుకున్నారు. కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. పిసల్‌బండ వద్ద శుక్రవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా బాలాపూర్ నుంచి చంద్రాయణగుట్ట వైపు బైక్‌పై వెళుతున్న రామాంతపూర్‌కు చెందిన డిప్లమా చేస్తున్న విద్యార్థి అభిషేక్(19), బాలాపూర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి నాగవంశీ(19). సైదాబాద్‌కు చెందిన ఐటీఐ విద్యార్థి రాజు(23) 2కిలోల గంజాయిని తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా రామాంతాపూర్‌కు చెందిన ప్రకాష్ వద్ద గంజాయిని కొనుగోలు చేసినట్లు వారు అంగీకరించారు. పట్టుబడిన విద్యార్థులు గంజాయిని 5, 6గ్రాములుగా ప్యాకెట్లుగా తయారు చేసి తమ స్నేహితులకు 3వందల నుంచి 5వందల రూపాయలకు విక్రయిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ముగ్గురు విద్యార్థులపై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్ చేసినట్లు, మూడు మొబైల్ ఫోన్స్, బైక్‌ను సీజ్ చేసినట్లు, మరో వ్యక్తి ప్రకాష్ పరారీలో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



క్యారం టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

● పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని అలకాపురి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఎస్‌ఆర్‌ఎం వర్క్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యారం టోర్నమెంట్‌ను యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డితో కలిసి భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో పిట్ట హరినాథ్ రెడ్డి, అల్కాపురి కాలనీ అధ్యక్షుడు వీఎస్ వంశీ, కార్యదర్శి శ్రీనివాస్, ఎన్‌వీ. సైదారావు, రాజు, రాజునాయక్, దినేష్, భాస్కర్, నాయక్, ప్రేమ్‌నాయక్, విజయ్, పెద్దవూర సైదులు, సంతోష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.